**"చూడు,** అత్తయ్యా! ఉమ ఏం చేసిందో? నా పుస్తకాలమీద అంతా ఇష్టం వచ్చినట్టు వ్రాసింది. నేను కాలేజీకి వెళ్లాలా? వద్దా?" అంటూ అనంతం పుస్తకాలని చేత్తో పట్టుకుని రాజమ్మకి ఎదురుగా నిలబడ్డాడు.

"పోనిద్దూ, అనంతం! ఆయన గనుక విన్నారా అంటే తిడతారు. చెబుతాగా. దానికి మరీ వస్తోంది!" అంటూ త్వరగా కావాలనే, ఆదుర్దాలో పొయ్యి విసురుతూ ఆ గొడవలోపడిపోయింది.

# ఉమ

కొమ్మూరి పద్మావతీదేవి

ఉమ చాలా మొండిదీ, పెంకిదీని. తండ్రి మాటన్నా కాస్త వింటుందిగానీ తల్లిమాట అసలే వినదు. తల్లి కోపంతో మండిపడిపోతూ తిడితే తను విరగబడి నవ్వుతుంది. ఉమ ఏళ్లకి మించిన చదువు చదువుతోందనీ, చాలా తెలివిగలదనీ అందరికీ అమిత ముద్దు. స్కూల్లో టీచర్లకి ఉమ అంటే చాలా ఇష్టం. ప్రతిసారీ క్లాసుకి ఫస్టు రావడం, బహుమతులు పుచ్చుకోవడం చూస్తే క్లాసులో పిల్లలందరికీ కూడా ఉమని చూస్తే చాలా ఇష్టం.

ఆఫీసుకు వెళ్లుతూన్న శర్మ ఏదో జ్ఞాపకం వచ్చి వెనక్కి తిరిగి, "ఇదిగో, చూడూ! ఈ సెలవులకి బావ వాళ్ల ఊరు రమ్మని రాశాడు. అందరం వెళదాం. ఇదిగో ఉత్తరం!" అంటూ రాజమ్మ చేతికి ఉత్తరం అందించి కారు ఎక్కి వెళ్లిపోయాడు.

ఉమ సాయంత్రం వస్తూనే, "అమ్మా! అమ్మా! మా స్కూలు వాళ్లంతా ఊటీకి వెళ్తున్నారమ్మా నేనూ వెళ్లనా? మా టీచరు నన్నూ రమ్మంది!"

"పనిలేకపోతే సరి!"

"ఎందుకమ్మా! అందరూ వెళ్లటంలేదూ!"

"ఊరికే గోల చెయ్యకు! వీల్లేదు. అంతే! అడ్డగాడిదలా ఉండి ఊటీకి వెళ్తుందిట!"

"నువ్వన్నీ అంతే! ఉండు, నాన్నగారిని అడుగుతాను!"

తండ్రి రాగానే ఉమ చెప్పవలసిన విధంగా చెబుతూ స్కూలు పిల్లలతో వెళ్లి తీరాలని నిశ్చయంగా చెప్పేసింది. రాజమ్మా అంతా ఒక పక్కన వింటూనే ఉన్నది. కూతురి మాటలకి తండ్రి తల ఆడించడం విని నవ్వుకుంది.

"ఎందుకత్తయ్యా రానంటూ ఉంటే ఉమని బలవంతం చెయ్యడం. పాపం, పల్లెటూరిలో ఏం తోస్తుందని. సరదాగా వెళ్లిరానీ అత్తయ్యా!" అన్నాడు అనంతం మజ్జిగ అన్నం కలుపుకుంటూ.

"నీకు తెలియదు, అనంతం! ఒక్కత్తీ వెళ్తే దాని ఆరోగ్యం చెడుతుంది. కూడా నే ఉండి అన్నీ ఇస్తూంటేనే సరిగ్గా తినదు. ఊళ్లు తిరిగి రావడానికి ఉమలాంటివాళ్లు తగరు!" అంటూ అన్నం గిన్నెమీద మూత విసురుగా పడేసి కోపం అణుచుకుంటూ హాల్లోకి వెళ్లింది.

ఉమ తల్లిని చూసి నవ్వుతూ, "అమ్మా! నువ్వూ వస్తావా బజారుకి, బోలెడు కొనాలి! నాన్న రెడీ!" అంటూ పూలదండ జడలో పెట్టుకుంది.

ఉమకి జవాబు చెప్పకుండానే రాజమ్మ శర్మ గదిలోకి వెళ్లింది. ఈ ప్రయాణం వద్దనీ, పిల్లని ఒంటిగా పంపడం తనకి ఇష్టం లేదనీ గట్టిగా చెప్పింది. ఉమకి ఉన్న ఉత్సాహాన్ని, ధైర్యాన్ని పాడుచేసి ఉత్త పిరికిదాన్నిగా రాజమ్మ తయారుచేస్తోందనీ, అలా వెళ్లి తిరిగిరావడం చాలా మంచిదనీ శర్మ వాదించాడు. తల్లితండ్రుల వాదనలు వింటూ ఏం తేలుతుందా అన్నట్లు కొంటెగా చూస్తూ గుమ్మం దగ్గిరే ఉమ నిలబడింది. రాజమ్మ ఏడుస్తూ ఉండగా శర్మ తలుపు తీసుకుని ఉమతో బజారుకి బయులుదేరాడు.

"ఇంక నా మాట ఎందుకు వింటుందీ! ఎంత ముద్దు అయినా చెప్పినట్లల్లా ఆడతారా? ఆడపిల్ల సంగతి తల్లికి తెలుస్తుందా, మీకా! ఇంత అయోమయం అయితే ఎలా చావనూ!" అంటూ గట్టిగా మాటలు అనుకుంటూ సణుగుతూ చూస్తూ నిలబడింది.

ఉమ ఊరికి వెళ్లగానే ఇల్లంతా చిన్నబోయింది. రాజమ్మకి బోలెడు బెంగపట్టుకుంది. పిల్ల ఎలా తిరిగి ఇంటికి సుఖంగా వస్తుందా అని. దేవుడి గదిలో దీపం వెలిగించి దేవుళ్లకి మొక్కుకుంటోంది. ఏ ఊరికీ, ఎక్కడికీ రానని శర్మకి ఎదురు తిరిగి చెప్పేసింది. దాంతో పూర్తి ప్రయాణం ఆగిపోయింది. అనంతం మాత్రం బయలుదేరాడు.

"వారం అయింది. ఉత్తరమన్నమాట లేదే!" అంటూ శర్మ కాఫీ తాగి గ్లాసు అందించాడు. గ్లాసు తీసుకుని వెళ్తూ వెనక్కి తిరిగి..

"ఎల్లుండి కాలేజీ తెరుస్తారు. రేపు తప్పకుండా రాడూ, అనంతం!" అన్నది రాజమ్మ.

"అనంతం కాదే, మన ఉమ సంగతి!" అంటూ చిరాకుపడిపోయాడు శర్మ. జవాబన్నా చెప్పకుండా వంట ఇంట్లోకి వెళ్లిపోయింది రాజమ్మ కోపంగా.

బండి దిగుతూనే సామానంతా హాల్లో పెట్టించి, "అత్తయ్యా! ఊరగాయలు, అప్పడాలు అన్నీ తెచ్చాను చూడు, మరి!" అంటూ తెచ్చిన వాటిలో మూటలు డబ్బాలు ఏరి తీసి రాజమ్మకు అందిస్తూ, "ఉమ రాలేదూ ఇంకా? ఏం?"

"నాకేం తెలుసునయ్యా అవన్నీ. సరేగానీ ఎందుకని ఇవన్నీ తెచ్చావు?"

"ఎందుకేవిటే? అనంతంకి ఈ నెలాఖరున పెళ్లిట. ఇదిగో బావ ఉత్తరం. ముందుగానే మనల్ని రమ్మన్నాడు."

"ఎవరి పెళ్లేమిటి! చెప్పావు కాదూ?

"ఏవిటి అత్తయ్యా? ఎంతో చెప్పాను చదువు పూర్తి అయ్యాక చేసుకుంటానని. నాన్న మాట వింటేగా. తన సంగతి ఏ నిమిషం ఏమవుతుందో అని భయంట. అందుకని ఈ పెళ్లికి ఒప్పుకుతీరాలన్నాడు. ఏం చెయ్యను?"

"మంచి పనే చేశావురా? బావ ఊరికే తొందరపడేవాడు కాదు!" అంటూ పోస్టువాడు వస్తే ఆదుర్దాగా ఉత్తరాలు అందుకున్నాడు.

"ఇవాళా రాలేదు!"

"సరేగానీ, ఉమని ఇద్దాం అనుకున్నాం గదా! ఆ సంగతి మీరు అడగనేలేదా ఏం?"

"దానికి అప్పుడే పెళ్లేవిటే? బాగా చదువుకోనీ! బావకీ అదే వ్రాశాను!"

"అయితే ఆయనే అడిగారన్నమాట. నాకు చెప్పారు కాదేం?"

"ఏమిటే నీ మొహం! అంతా చాదస్తం మాటలు! మన కాలం కాదు, తెలిసిందా? దానికి బాగా చదువుకోవాలని ఉంది. దాని ఇష్టం అంతే, అట్టే వాగించకూ!"

"అవును, అవును. చదివి ఏం చేస్తుందీ! ఊళ్లు ఏలాలా? ఉద్యోగాలు చేయాలా? సరిపోయారు ఇద్దరూ!"

"ఇంకేం? ఊరుకోరాదూ? ఏ సంగతికీ రాక!" శర్మకీ రాజమ్మకీ మధ్య చిన్న తుపాను లేచింది. అనంతం అంత మంచి పిల్లవాడు అల్లుడు కాకుండా చెయ్యిదాటిపోవడంతో రాజమ్మ నిలువునా క్రుంగిపోయింది. ఉన్న ఒక్క కూతురికీ మంచి సంబంధం శర్మ తేడనీ, తేలేడనీ నిశ్చయానికి వచ్చేసింది. కళ్లనీళ్లు పెట్టుకుంటూ దిగులుగా ఎలాగో అయిపోయింది. అనంతం అన్ని సంగతులూ చూస్తూ ఉన్నాడు.

"అత్తయ్యా? ఒళ్లు బాగాలేదా ఏం? అలా ఉన్నావేం? ఉమ రాలేదనే. వాళ్ల స్కూలుకి వెళ్లి కనుక్కురానా?"

"ఆయన కనుక్కుంటారులే! ఇంతకీ నీకు కట్నం ఎంత? ఎవరి పిల్లేమిటి?"

"నాకవన్నీ తెలియవు అత్తయ్యా? బలవంతాన ఒప్పుకున్నా అంతే! కోపంతో అసలు ఆ పిల్లని చూడనన్నా లేదు. దగ్గర బంధువులట!"

"అదెలా ఒప్పుకున్నావు? మీ నాన్నగారు ఊరుకున్నారు మరి?"

"ఉమ కాకపోయాక ఎవరయితే నేం అత్తయ్యా?" అంటూ అనంతం అక్కడనించి వెళ్లిపోయాడు.

రాజమ్మ నిర్ఘాంతపోయి అటే చూస్తూ, భర్త తెలివితక్కువతనానికి తిట్టుకుంటూ నేలమీద అలానే కూర్చుండిపోయింది.

శర్మ కారు దిగుతూనే కోపంగా చేతిలోని కాగితాలను బల్లమీద విసిరికొట్టి "ఇవాళా రాలేదు ఉత్తరం! వాళ్లంతా వచ్చేశారట!"

"ఎప్పుడూ?" అన్నది రాజమ్మ కళ్లింత చేసి.

"ఎప్పుడేమిటే, మొన్ననే వెళ్లిన వాళ్లంతా వచ్చేశారట. వాళ్ల టీచరు ఊరికి ఆవిడతో వెళ్లిందిట మైసూరుకి. ఇదీ వెళ్లినవాళ్లు చెప్పారు!"

"ఇవాళ వచ్చి తీరాలి. రేపేగా స్కూలు!"

"ఆవిడగారు రాదుట. మంగుళూరుకు మార్చారుట!" అంటూ శర్మ కారులో మళ్లీ బయలుదేరాడు.

రాజమ్మ కూర్చున్నచోట నుంచి కదలలేదు. ఎదురుగా గోడకి ఉన్న ఏడుకొండలస్వామికి మళ్లీ మళ్లీ చేతులెత్తి నమస్కరించింది. పూజలు చేయిస్తా

ఈ కథ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 25.3.59 సంచికలో ప్రచురితమయింది.

తండ్రీ అని గొణిగింది.

కారు దిగుతూనే, "నేను మైసూరు వెళుతున్నా గానీ, అనంతాన్ని స్టేషనుకు రమ్మను!"

"ఏం? ఏమయిందీ?" అంటూ నిలబడిపోయి గోడని పట్టుకుని తూలింది రాజమ్మ.

"వెంటనే రమ్మను, తెలిసిందా!" అంటూ కావలసినవి సర్దుకుంటూ రాజమ్మకి జవాబు చెప్పకుండా ముఖం ఎత్తి అటు చూడకుండా ఆదుర్దాగా వెళ్లిపోయాడు.

కారు వెళ్లగానే రాజమ్మ గుండెలు కొట్టుకున్నాయి. శర్మ దేనికీ తొందరపడే మనిషి కాదు. అలాంటిది అంత ఆదుర్దాగా వెళ్లడంతో ఏదో ఉందని అనుమానపడింది. వెయ్యి విధాల ఆలోచనలు తల్లో రైలులాగా పరుగెత్తాయి. కాళ్లువణికి శరీరం తేలిపోతోంది. అనంతంకోసం ఎంతో చూసింది. అతనూ రాలేదు. అడుగుల చప్పుడుకి వెనక్కి తిరిగింది. శర్మ తల వంచుకుని మాట్లాడకుండా ఏదో తప్పు చేసినవాడిలా గదిలోకి వెళ్లిపోయాడు. రాజమ్మ వెనకాలే వెళ్లింది.

"ఏం? వెళ్లలేదేం? రైలు ...."

"అన్నీ ప్రశ్నలేనా? రైలు అందితే వెళ్లనూ?"

"అబ్బ! ఎంత విసుగండీ! దాన్ని పంపకుండా ఉంటే ఇంత ఆదుర్దాలు మనకి ఉండేవా? నా మాట విన్నారా?"

"మన చేతిలో ఏముందీ? జరగవలసింది జరిగింది. అంతే! ఎవ్వరం ఏమీ చెయ్యలేం!"

"ఏమిటండీ అలా నీరు కారిపోతున్నారు. ఏమైంది? చెబుతారా, లేదా?"

"ఏం చెప్పనే! ఆ టీచరు అన్నని పెళ్లి చేసుకుందిట. మన ఖర్మ అంతే!"

"అయ్యో! అయ్యో! ఊరుకోవడమే. నా తల్లిని ఎవరో మోసం చేశారు. ఊరుకోకండి!"

"అల్లరిచేసి వీధిన పడమంటావా? ఇక్కడే ప్లాను వేసుకుని మరీ వెళ్లారుట. మనకే ఏం తెలియదు. నాకు చెబితే నేను ఒప్పుకోననీ ఇంత నాటకం ఆడింది. కానీ, ఏం చేస్తాం!"

"ఏం? ఎవరేవిటా అతను. కొంప ముంచిందే! ఇంత పనిచేసిందా?" అంటూ రాజమ్మ ముఖానికి కొంగు అడ్డం పెట్టుకుని బావురుమన్నది.

శర్మ కూడా కన్నీళ్లు ఆపుకుంటూ, "అయిపోయిందానికి ఏడిస్తే ఏం లాభం? మన ఖర్మ అంతే! అల్లరీ ఆగమూ చెయ్యకు!"

"మీ కెలా తెలిసిందీ ఇదంతాను?"

"ఎలా తెలిస్తే ఏం? తెలిసింది. పెళ్లి అయిపోయిందని అదే నాకు టెలిగ్రాం ఇచ్చింది. రమ్మంటే వస్తుందిట!"

"అదుగో, అనంతం! అనంతం కొంప మునిగిందయ్యా! ఉమ .... మన ఉమ "

"ఏం? ఏమయిందీ ఉమకి. ఏమైంది మావయ్యా?"

"ఏం అవ్వాలో అదే అయిందయ్యా!" అంటూ నేలమీద పడి ఏడ్చింది రాజమ్మ. ■

